

కూలి రేట్లు పెంచాలని కూలీల ఆందోళన



జంగారెడ్డిగూడెం: కూలి రేట్లు పెంచాలని కోరుతూ పంగిడిగూడెంలో వ్యవసాయ కూలీలు ఆందోళన చేపట్టారు. శుక్రవారం లక్కవరానికి చెందిన కూలీలకు రైతులు రూ.300 ఇచ్చి పనుల నిమిత్తం గ్రామాలకు తీసుకురావడాన్ని పంగిడిగూడెం కూలీలు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. పంగిడిగూడెంలో కూలీలకు మాత్రం రోజుకు ఒక్కొక్కరికి రూ.250 రూపాయలు ఇస్తున్న రైతులు లక్కవరం నుండి వస్తున్న కూలీలకు రూ.300 కూలి ఇస్తున్నారని వాపోయారు. ఈ క్రమంలో లక్కవరం నుంచి గంగవరం వెళ్తున్న కూలీల ట్రాక్టర్లను పంగిడిగూడేనికి చెందిన కూలీలు అడ్డుకుని నిరసన చేపట్టారు. ప్రతీ కూలీకి రూ.300 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పంగిడిగూడెంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

బదిలీలు జరిగేనా..!


గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో విస్తృత చర్చ

ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల్లో ఏడు వేల మందికిపైగా ఉద్యోగులు

60 శాతానికిపైగా ఉద్యోగులు బదిలీ కోసం ఎదురుచూపులు

ఏప్రిల్‌లో బదిలీలంటూ పెద్దఎత్తున ప్రచారం

ప్రభుత్వం నుంచి కదలిక లేకపోవడంతో ఉద్యోగుల్లో నిర్వేదం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బదిలీల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. దూరప్రాంతాల వారంతా తమ సొంత ప్రాంతాలకు వెళ్లాలని తహతహలాడుతున్నారు. ముఖ్యంగా వేరే జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులు కుటుంబపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019 అక్టోబర్ రెండో తేదీన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బాధ్యతలు చేపట్టారు. మూడున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించి బదిలీల ప్రక్రియ చేపట్టలేదు. 2021 అక్టోబర్‌కు సచివాలయ ఉద్యోగులకు రెండేళ్లు పూర్తయినా రెగ్యులర్ చేయకుండా తొమ్మిది నెలలు ఆలస్యంగా 2022 జులైలో రెగ్యులర్ చేసిన పరిస్థితి ఉంది. దీంతో ఉద్యోగులంతా తొమ్మిది నెలల సర్వీసు కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. రెగ్యులర్ చేయడంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వం బదిలీల విషయంలోనూ కాలయాపన చేస్తుందనే విమర్శలు ఉద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. నియామకాల సమయంలో తమ సొంత ప్రాంతాలకు 50 కిలోమీటర్ల అంతకు మించి ఎక్కువ దూరంలో పోస్టింగులు వచ్చాయి. బదిలీలు జరిగేటప్పుడు తమ ప్రాంతాలకు వెళ్లొచ్చనే ఆలోచనతో ఉద్యోగాల్లో చేరిపోయారు. తూర్పుగోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాలకు చెందిన ఉద్యోగులు కూడా జిల్లాలో పని చేస్తున్నారు. కుటుంబం ఒకచోట, ఉద్యోగం మరోచోట అన్నట్లు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి తయారైంది. జిల్లాలో 938 గ్రామ సచివాలయాలు, 207 వార్డు సచివాలయాలు మొత్తం 1,165 ఉన్నాయి. వీటిలో దాదాపు ఏడు వేల మంది వరకూ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో 60 శాతం మందికిపైగా సచివాలయ ఉద్యోగులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. బదిలీల్లో తాము కోరుకున్న స్థానానికి వెళ్లొచ్చని, కుటుంబంతో ఉండొచ్చని ఆశపడుతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం బదిలీలపై ఎటువంటి కదలికా లేకుండాపోయింది. కొద్దిరోజుల క్రితం సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ మంత్రులతో బదిలీలపై మాట్లాడామని, ఏప్రిల్‌లో ఉండొచ్చని ప్రకటించారు. ఏప్రిల్ రావడంతో సచివాలయ ఉద్యోగుల్లో బదిలీలపై చర్చ పెద్దఎత్తున సాగుతోంది. బదిలీల ప్రక్రియ ఎప్పుడు చేపడతారని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు బదిలీలు చేయకపోతే ఎన్నికల దగ్గర పడుతుండటంతో ఇక చేపట్టే పరిస్థితి ఉండదనే ఆందోళన అందరినీ వెంటాడుతోంది. బదిలీలు చేపట్టాలంటూ సచివాలయ ఉద్యోగులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల్లో ప్రభుత్వంపై అసంతృప్తి

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తమ మానస పుత్రికగా వైసిపి ప్రభుత్వం పదేపదే చెబుతోంది. వచ్చే ఎన్నికల్లో సచివాలయ ఉద్యోగులు వైసిపికి అండగా ఉంటారని భావిస్తోంది. అయితే ప్రభుత్వ నిర్ణయాల కారణంగా ప్రభుత్వంపై సచివాలయ ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోంది. సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంలో తొమ్మిది నెలలు ఆలస్యం చేయడంతో అన్ని నెలల సర్వీసు, పే స్కేల్‌లో వచ్చే పెంపు జీతం కోల్పోయామనే భావన ఉద్యోగుల్లో నెలకొంది. అంతేకాకుండా స్థానికంగా ఉన్న వైసిపి నాయకులు సచివాలయ ఉద్యోగులపై పెత్తనం చేస్తున్న తీరుతో వారంతా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ముఖ్యంగా సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులను బందోబస్తు పేరుతో పోలీసు అధికారులు పెడుతున్న ఇబ్బందులు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ప్రభుత్వం బదిలీల ప్రక్రియపై మౌనం వహించడం, సమస్యలు అపరిష్కృతంగా ఉండటంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోయినట్లు తెలుస్తోంది.

ఐటిడిఎ పిఒ నియామకంలో నిర్లక్ష్యం తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కెఆర్‌పురం ఐటిడిఎకు రెగ్యులర్ పిఒగా ఐఎఎస్ అధికారిని నియమించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కెఆర్‌పురం ఐటిడిఎలో పిఒ పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించేలా ఐఎఎస్ అధికారిని నియమించాలని ఇప్పటికే అనేకసార్లు సిపిఎం, ప్రజాసంఘాలు, అక్కడి గిరిజనులు కోరినా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మొద్దునిద్ర నటించడం దారుణమని పేర్కొన్నారు. మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు ఎదుర్కోనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 57 మంది ఐఎఎస్ అధికారులను బదిలీ చేసినా కెఆర్‌పురం ఐటిడిఎకు పిఒగా ఐఎఎస్ అధికారిని నియమించాలనే డిమాండ్ గుర్తు లేకపోవడం హాస్యాస్పదమని విమర్శించారు. గిరిజనులు తమ సమస్యలను చెప్పుకోవడానికి ఐటిడిఎకు వస్తే అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలంలో ఇన్‌ఛార్జి పిఒలను నియమించి వారిని కొద్ది కాలం వ్యవధిలోనే బదిలీ చేయడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. రెగ్యులర్ పిఒ లేకపోవడం వల్ల ప్రతి బుధవారం నిర్వహించే గిరిజన దర్బార్‌లో ప్రజా సమస్యలను వినే నాధుడు లేక గిరిజనులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. గిరిజనులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఐటిడిఎ కేంద్రంగా ఐఎఎస్ అధికారిని పిఒగా నియమించాలని రవి డిమాండ్ చేశారు.



కెఆర్.పురం ఐటిడిఎ

టిడ్కో ఇళ్ల కోసం 17న 12 గంటల దీక్ష

టిడిపి నేత బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు

టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు అందించని పక్షంలో ఈ నెల 17న 12 గంటల దీక్ష చేపట్టనున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి హెచ్చరించారు. పోణంగి రోడ్డులో నిర్మించిన టిడ్కో ఇళ్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన టిడ్కో ఇళ్లు పర్యవేక్షణ లేక పాడైపోతున్నాయని చంటి ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 6500 ఇళ్లు నిర్మిస్తే నాలుగేళ్లపాటు వాటి అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిన వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వకుండా మాయమాటలతో మోసగిస్తోందని ఆరోపించారు. కేవలం 2,200 ఇళ్లు మాత్రమే లబ్ధిదారులకు ఇస్తామని, మిగిలిన వారికి జగనన్న కాలనీల్లో ఇళ్లుఇస్తామని ప్రభుత్వం ప్రగల్భాలు పలికిందన్నారు. అదీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ నెల 14వ తేదీ అంబేద్కర్ జయంతిలోపు ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్పష్టంగా ప్రకటించని పక్షంలో 17న 12 గంటల దీక్ష తానే చేపడతానని ప్రకటించారు. లబ్ధిదారులు, ప్రజలు ఈ దీక్షలో పాల్గొనాలని చంటి కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇళ్లను పరిశీలిస్తున్న చంటి



సంతాపం తెలుపుతున్న నాయకులు

సిపిఎం నేత రత్నకిషోర్ మృతిపట్ల సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎం నేత ఎం.రత్నకిషోర్ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఆ పార్టీ మధ్యతరగతి శాఖ ఆధ్వర్యంలో సంతాప సభ శుక్రవారం ఉదయం స్థానిక కార్యాలయంలో శాఖ కార్యదర్శి కడలి రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రత్నకిషోర్ సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారని, ఉద్యోగ విరమణ అనంతరం తమ పిల్లల వద్ద హైదరాబాదులో నివశిస్తున్నారని అన్నారు. కొంతకాలంగా కేన్సర్‌కు చికిత్స పొందుతున్నారని తెలిపారు. అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్‌లో మృతి చెందారని చెప్పారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ రత్నకిషోర్ మృతి పార్టీకి తీరనిలోటన్నారు. తుదిశ్వాస విడిచే వరకు పార్టీ పట్ల అంకితభావం, నిబద్ధత కనబరిచారని కొనియాడారు. జెవివి రాష్ట్ర నాయకులు ఎస్ఎన్.రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పని చేయడం ద్వారానే మార్పు తేగలమని రత్నకిషోర్ ఎప్పుడు ఆకాంక్షించే వారిని గుర్తు చేశారు. జెవివి జిల్లా కార్యదర్శి ఐవి.సుధాకర్ మాట్లాడుతూ రత్నకిషోర్ తనతోపాటు కుటుంబ సభ్యులకు కూడా సమాజం పట్ల బాధ్యతను నేర్పారని తెలిపారు. సిఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ ఎల్.వెంకటేశ్వరరావు, నేతలు విజిఎంఆర్.కృష్ణారావు, పి.ఆదిశేషు తదితరులు మాట్లాడగా సాయి రమేష్, ధనుంజయ, గంగాధర్‌రావు, లెనిన్, శ్రీను పాల్గొన్నారు.



ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో నాయకులు

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం : బొరగం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమని, సిఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ విమర్శించారు. మండలకేంద్రమైన బుట్టాయగూడెంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం శ్రీనివాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. వైసిపి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో నిత్యావసర ధరలు, ఆర్‌టిసి, విద్యుత్ ఛార్జీలు భారీగా పెరిగాయన్నారు. చెత్తసేకరణ పన్నులు విధించి పేదలపై మోయలేని భారాలు మోపిందన్నారు. సామాన్యులు బతకలేని పరిస్థితికి జగన్ తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో గంజాయి మయం తప్ప ఉపాధి లేదని ఇంత అసమర్థ ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలను సంక్షేమం పేరుతో మోసం చేస్తూ అప్పులు చేస్తూ సంక్షోభంలో ముంచారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని, అభివృద్ధి చెందుతుందని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్టీ అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, పార్లమెంట్ రైతు కార్యదర్శి గద్దె అబ్బులు, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యండ్రప్రగడ శ్రీనివాస్, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, నియోజవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం రామకృష్ణ, ఎస్‌టి సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరరావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి జారం చాందిని, నియోజవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బ రాంబాబు, రైతు కార్యదర్శి కుందుల శ్రీను, సొసైటీ మాజీ అధ్యక్షులు కరగర రాము, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు వరక కృష్ణంరాజు, పూసం ముక్కమ్మ పాల్గొన్నారు.

పోల్‌రాజ్ కెనాల్ ఉరకలు..!

బలహీనంగా కాల్వగట్లు అందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ప్రధాన పంట కాల్వల్లో ఒకటైన పోల్‌రాజ్ కెనాల్ ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. దీంతో కాల్వ ఆయకట్టు రైతులు, ప్రజలు భయందోళనలకు గురవుతున్నారు. కాల్వలో నీరు పరిమితికి మించి ప్రవహించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయం కాల్వ ఆయకట్టు గ్రామాల ప్రజలను వెంటాడుతోంది. ముదినేపల్లిలో నీరు కాల్వగట్ల అంచులను తాకుతూ ప్రవహిస్తూ గట్లపైకి నీరు చేరే పరిస్థితి ఉంది. కాల్వ గట్లు చాలా బలహీనంగా ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లి నుంచి కైకలూరు వైపు కాల్వ గట్లు బలహీనంగా ఉన్నాయి. దీంతో నీటి ఉధృతికి కాల్వకు గండి పడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. గట్లు పటిష్టం చేసి ఎన్నో ఏళ్లు కావడంతో కాలక్రమేణా కాల్వ గట్లు కోతకు గురై బలహీన పడ్డాయి. దీంతో ప్రస్తుతం కాల్వలో ప్రవహిస్తున్న నీటి ఒరవడికి గట్లకు గండి పడే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. కాల్వ ఆయకట్టు వెంబడి ఉన్న సార్వా వరికుప్పలు నూర్పిళ్లు చేయకుండా అలానే ఉన్నాయి. అంతేకాక మినుము పైరు కుప్పలు కూడ ఉన్నాయి. దీంతో కాల్వకు గండి పడితే తమ పరిస్థితి ఏమిటని పలువురు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఐదు నెలలుగా కాల్వలో నీరు విరామం లేకుండా వదులు తున్నారని, గతంలో ఎన్నడూ ఈ తరహాలో వేసవిలో నీరు విడుదల చేయలేదని రైతులు చెబుతున్నారు. చేపల చెరువుల కోసమే నీరు విరామం లేకుండా వదులుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకు అవసరమైనప్పుడు నీరు విడుదల చేయకుండా ఇప్పుడు నీరు యథేచ్ఛగా వదలడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోల్‌రాజ్ కెనాల్ గట్లు బలహీనంగా ఉన్న దృష్ట్యా కాల్వలో నీటి సరఫరా పరిమితికి మించి వదలకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఎంతోకాలంగా బలహీనంగా ఉన్న కాల్వగట్లను పటిష్టం చేసేందుకు అధికారులు ఈ వేసవిలో చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు ముక్తకంఠంతో అధికారులను కోరుతున్నారు.




పోల్‌రాజ్ కెనాల్

సంక్షేమం ఘనత జగన్ సొంతం

ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు

ప్రజాశక్తి - ముసునూరు

మహిళలకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు అన్నారు. శుక్రవారం మండలంలోని లోపూడి గ్రామంలో గడపగడపకూ వైఎస్ఆర్ కార్యక్రమం సర్పంచి పేరం కృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ అమ్మఒడి నుండి రైతుభరోసా వరకు ఎన్నో సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. జనం పథకాలకు సంబంధించి చెప్పిన ఇబ్బందులపై వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, సుబ్బారావు, వైసిపి మండల అధ్యక్షులు ఎం.నాగమల్లేశ్వరరావు, నాయకులు బి.నర్సింహారావు, తహాశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఎఇ టివి.నరసింహారావు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ ప్రతాప్


ఎపి సీడ్స్‌లో టెండర్ విధానం రద్దు కోరుతూ ర్యాలీ

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎపి సీడ్స్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన టెండర్ విధానం రద్దు చేయాలని అఖిలపక్షం ముక్తకంఠంతో అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక రామభద్ర కాంప్లెక్స్ నుండి వెంకటేశ్వర థియేటర్ సెంటర్ మీదుగా నరేంద్ర సెంటర్ వరకు హమాలీలు ర్యాలీ నిర్వహించారు. ఎపి సీడ్స్‌లో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఆపాలని, పాత పద్ధతిలో అగ్రిమెంట్ చేయాలని పెద్దఎత్తున నినదించారు. అనంతరం నరేంద్ర సెంటర్‌లో తెలుగునాడు కార్మిక సంఘం నేత రెడ్డి రామకృష్ణ, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి దిర్శిపో రామకృష్ణ, జనసేన నాయకులు అనుకుల రమేష్, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, పౌరహక్కుల నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, సిఐటియు నాయకులు ఎ.అజయకుమారి, పట్టణ కార్యదర్శి గుబ్బల గోపీ మాట్లాడారు. ఎపి సీడ్స్‌లో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న హమాలీలను తొలగించడం చట్ట విరుద్ధం, అన్యాయమన్నారు. చట్టాలు అమలు చేయాల్సినవారే వాటిని పక్కన పెట్టడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో 18 యూనిట్లు ఉంటే అందులో ఎక్కడా లేని టెండర్ విధానం తణుకులో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు, రమణ, బాలాజీ, సూరిబాబు, వరలక్ష్మి, రూతమ్మ, నిమ్మకాయల లక్ష్మి, నాగమణి, పి.లక్ష్మి పాల్గొన్నారు.



అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ, ధర్నా, మాట్లాడుతున్న నాయకులు



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వాసుబాబు

గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో తేడాను గుర్తించండి

వచ్చే ఎన్నికల్లో జగనన్ననే గెలిపించండి

చేబ్రోలులో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - ఉంగుటూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన వినూత్న సంక్షేమ పథకాల లబ్ధిని గమనించి, గత తెలుగుదేశ ప్రభుత్వానికి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించండి' అని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని చేబ్రోలులో శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. సాయిరాంపేటలో ఇంటింటా తిరిగి ప్రజలతో మమేకమై మాట్లాడారు. వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఎంపిటిసిలు మనసాల నాగమణి, రాయి లక్ష్మి, మాజీ సర్పంచి కర్ణం బుజ్జి, సొసైటీ ఛైర్‌పర్సన్ పాపారావు బాబ్జి, ఆకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదేశించినా తగ్గని ధరలు

వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య

ప్రజాశక్తి - ఆకివీడు

సామాన్య ప్రజానీకం అత్యంత ప్రాణాపాయ సమయంలో వినియోగించే మందులు ధరల తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా మార్కెట్లో ధరలు మాత్రం తగ్గడం లేదని వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 840 అత్యవసర మందుల జాబితాలో 651 మందుల ధరలను ఏడు శాతం ప్రభుత్వం తగ్గించిందని చెప్పారు. అయినప్పటికీ వ్యాపారులు మాత్రం ధర తగ్గించడం లేదన్నారు. సంబంధిత అధికారులు షాపులను తనిఖీ చేసి కొత్త ధర అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి దుకాణం వద్ద పాత, కొత్త ధరలను విడివిడిగా సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయించాలని కోరారు. మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, దారుణమైన నొప్పి, పక్షవాతం, కాలేయం సమస్యలు వంటి వాటికి వినియోగించే మందులు ఈ అత్యవసర జాబితాలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో నకిలీ మందులు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని తనకు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేకంగా అతి తక్కువ ధరకు అందజేసే జనరిక్ మందులు సైతం సాధారణ మందుల షాపుల్లో సాధారణ ధరలకు విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మోసాలను నివారించేలా అధికారుల తనిఖీలు పెరగాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి మందుల ధరలు తగ్గి జనానికి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, తనిఖీ అధికారుల, జెసితో వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.




సాల్మన్‌రాజు, ప్రకాశరావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ధన్యజీవులు సాల్మన్‌రాజు, ప్రకాశరావు

ప్రజాశక్తి - పోడూరు

బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడి తమ జీవితాన్ని త్యాగం చేసిన ధన్యజీవులు దిగుపాటి సాల్మన్‌రాజు, ప్రకాశరావు అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. వీరి 43వ వర్ధంతి సభ పండితవిల్లూరు స్తూపం వద్ద ముడే మోజేష్ అధ్యక్షతన జరిగింది. తొలుత వారి చిత్రపటాలకు సీనియర్ నాయకులు కడలి సూర్యారావు, కేతా గోపాలన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేతలు బండి రంగారావు ప్రసాద్, కాటూరి యాకోబు, గూటం జోషిక్రాంతికుమార్, మల్లుల రామారావు, మల్లుల కొండమ్మ, మల్లుల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తానేటి వనిత

14న సిఎం జగన్ కొవ్వూరు రాక

ప్రజాశక్తి - కొవ్వూరు

సిఎం జగన్ ఈనెల 14న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పర్యటన నేపథ్యంలో ముందస్తుగా సభ నిర్వహణ ప్రాంతాన్ని పరిశీలించినట్లు హోం మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం రాత్రి కొవ్వూరు నియోజక వర్గంలోని కొవ్వూరు, చాగల్లు మండలాల్లో మంత్రి, కలెక్టర్, జెసి, ఆర్‌డిఒ మునిసిపల్ కమిషనర్లు పర్యటించారు. ఈ సందర్భంగా తానేటి వనిత మాట్లాడుతూ 14న అంబేద్కర్ జయంతి రోజున కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ కొవ్వూరులోని యువరాజ్ ఫంక్షన్ హాలు సమీపంలో దేవర్ల రిలయన్స్ సైట్, తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ప్రాంతాలను, గోష్పాద రేవు సమీపంలో ఉన్న ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, మాజీ ఎంఎల్‌సి కె.శివరామకృష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆగ్రాలో ముదినేపల్లి వాసి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆగ్రాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముదినేపల్లికి చెందిన లారీ క్లీనర్ దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ముదినేపల్లి రెండో బజారుకు చెందిన ఉప్పల రామాంజనేయులు(అంజి)(33) గత నెల 31వ తేదీన లారీ డ్రైవర్‌కు క్లీనర్‌గా ఆగ్రా వెళ్లాడు. ఈనెల నాలుగో తేదీ రాత్రి ఆగ్రాలో రోడ్డుపై నడుస్తుండగా వేరే వాహనం రామాంజనేయులుని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం ఆగ్రా పోలీసులు ముదినేపల్లిలో ఉన్న అతని తండ్రి ఉప్పల శేషగిరికి సమాచారం అందించారు. మృతదేహాన్ని శుక్రవారం అర్ధరాత్రికి ముదినేపల్లి తీసుకురానున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామాంజనేయులు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముసునూరు

కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాట్రేనిపాడులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మారెళ్ల కోటేశ్వరరావు(36) శుక్రవారం ఉదయం తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. నొప్పి తట్టుకోలేక పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతని కుటుంబ సభ్యులు నూజివీడు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

పరారైన అంతఃరాష్ట్ర దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని సిసిఎస్ పోలీస్ స్టేషన్‌లో విచారణలో ఉండగా పరారైన అంతఃరాష్ట్ర దొంగను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ గత నెల 30వ తేదీ సాయంత్రం తొమ్మిది గంటల సమయంలో నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగంగూడెం శ్రీఆంజనేయ స్వామి గుడిలో కిరీటం దొంగతనం, చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటపాడు రామాలయంలోని రెండు బంగారపు మంగళ సూత్రాలు, మూడు వెండి కిరీటాలు, ఒక వెండి అభయ హస్తం దొంగతనం చేసిన పాత నేరస్తుడు పఠాన్ సలార్ ఖాన్‌ను నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ అరెస్ట్ చేశారు. అతన్ని నూజివీడు సిసిఎస్ స్టేషన్‌లో విచారణ నిమిత్తం ఉంచారు. అదేరోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డును మభ్యపెట్టి గదిలో హోంగార్డును ఉంచి తలుపు బయట గడియపెట్టి అదే హోం గార్డ్‌కు చెందిన ఎపి16 సిఎక్స్8934 నెంబర్ గల మోటార్ సైకిల్‌పై పరారయ్యాడు. కాపలాగా ఉన్న సిసిఎస్ కానిస్టేబుల్ చంటి ఇచ్చిన ఫిర్యాదుపై నూజివీడు టౌన్ పోలీసులు కేసు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. నాలుగు బృందాలుగా ఏర్పడి చేపట్టిన గాలింపు చర్యల్లో పఠాన్ సలార్ ఖాన్‌ను శుక్రవారం నూజివీడు టౌన్-2 ఎస్ఐ గౌరిల వెంకటేష్, పోలీస్ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేసులో ప్రతిభ చూపిన వారిని నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్‌గౌడ్ అభినందించారు. సలార్ ఖాన్ దొంగిలించిన రెండు ఆభరణాలను తూర్పుగోదావరి జిల్లా తునిలో ఉన్న అతని స్నేహితునికి ఇచ్చినట్లు తెలిపారు. నూజివీడు సిసిఎస్ నుండి పారిపోయేందుకు వినియోగించిన హోం గార్డ్ మోటార్ సైకిలును, రెండు బంగారపు సూత్రాలను, రెండు వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పంగిడిగూడెం శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం బియ్యం తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న డిప్యూటీ తహశీల్దార్ రమేష్, ఎస్‌ఐ.సాగర్‌బాబు ప్రత్యేక నిఘా పెట్టి బియ్యం లారిని స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాజిల్లా విస్సన్నపేట నుంచి రేషన్ బియ్యాన్ని కొయ్యలగూడెం తరలిస్తుండగా పట్టుకున్నట్లు రమేష్ తెలిపారు. కోళ్ల ఫారానికి ఈ బియ్యం తరలిస్తున్నామని లారీ డ్రైవర్ పఠాల రామకృష్ణ చెబుతున్నాడని, ఓట చంద్రకుమార్ ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడని అధికారులు తెలిపారు. 192 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామని, లారీ, బియ్యం కలిపి రూ.10లక్షల 40వేలు విలువ ఉంటుందని తెలిపారు. లారీని జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సాగర్ బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి - పెనుమంట్ర


అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని ఏలూరు విజిలెన్స్ సిఐ శివరామకృష్ణ అన్నారు. వీరవాసరం నుంచి తూర్పుగోదావరి జిల్లాకు గురువారం అర్ధరాత్రి బ్రాహ్మణచెరువు మీదుగా వ్యాన్‌లో తరలిస్తున్న బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా సిఐ శివరామకృష్ణ మాట్లాడుతూ రూ.72 వేల విలువచేసే 72 బస్తాల బియ్యాన్ని, రూ.6 లక్షల విలువ చేసే వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. బియ్యాన్ని పెనుమంట్ర సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించామని తెలిపారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి బి.పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వర్లు, విఆర్ఓ నాగబాబు ఉన్నారు.

వైసిపి హయంలోనే సంక్షేమ పథకాల అమలు


'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాల్లో వైసిపి నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఓ చరిత్ర సృష్టిస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ విఆర్.ఎలిజా అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఏడో తేదీ నుండి 20వ తేదీ వరకూ ప్రతిష్టాత్మకంగా 'జగనన్న మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని 14 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని ఇళ్లకు వైసిపి శ్రేణులు, గృహ సారధులు, సచివాలయ వాలంటీర్ల కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఈ నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని చెప్పడమే కాకుండా గత టిడిపి ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను కూడా వివరిస్తామని చెప్పారు. ఎన్నికల ముందు సిఎంఎ జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, అద్భుతమైన పరిపాలన అందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు ఇవ్వాలంటే చాలా ఇబ్బంది పట్టేవారని, కానీ నేటి వైసిపి ప్రభుత్వంలో పారదర్శకంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఎప్పటికప్పుడు కొత్త పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు 31 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చామని వాటిలో పదిహేను లక్షల ఇళ్లు కట్టిస్తూ చరిత్ర సృష్టించామన్నారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు లేనిది ఉన్నట్లు ఉన్నది లేనట్లు తమ అనుకూల మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నేడు తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేస్తారా లేక రద్దు చేస్తారా చెప్పి ఎన్నికలకు వెళ్లాలన్నారు. ప్రజలందరికీ గత టిడిపి ప్రభుత్వానికి ఇప్పటి వైసిపి ప్రభుత్వానికి మధ్య తేడాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు చెప్పి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తూ, అపోహలను తొలగించే విధంగా ఈ నూతన కార్యక్రమానికి జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రజలు, నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ, ఎంపిపి కొదమ జ్యోతి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయి బాలపద్మ, పట్టణ వైసిపి అధ్యక్షులు పిపిఎస్.చంద్రరావు పాల్గొన్నారు.



పోలవరంలో..



చాట్రాయిలో..

పోలవరం : పోలవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జగన్ చేపడుతున్న సంక్షేమ పథకాలను వైసిపి మండల అధ్యక్షులు బి.మురళీకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయిరాం, కో కన్వీనర్ పోడుం శ్యామ్‌కుమార్, సచివాలయ మండల కన్వీనర్ అక్కబత్తుల భవాని, వైసిపి జిల్లా జనరల్ సెక్రటరీ మున్ని, అక్కాబత్తుల రాజు, ఉప సర్పంచి కె.శ్రీను, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ వాలంటీర్లు పాల్గొన్నారు.

మండలంలో గూటాల, కొత్త పట్టిసీమ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వానికీ, వైసిపి ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త పట్టిసీమ సర్పంచి మైగాపుల విజయదుర్గ, వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, జల్లేపల్లి రామకృష్ణ, గూటాల సొసైటీ ప్రెసిడెంట్ సుంకర అంజిబాబు, ప్రసాద్, గృహహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చాట్రాయి:జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మండలంలోని బూరుగుగూడెంలో ఎపి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ పథకాలు కొనసాగాంటే, ప్రజలు అభివృద్ధి చెందాలంటే ప్రజలందరూ జగన్‌కు అండగా ఉండాలన్నారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి జగన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి డి.హైమావతి, ఎంపిపి లంక నిర్మల, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్యదర్శి గారూ గుంతను పూడ్చరూ..!

రోడ్డు విస్తరణలో తవ్విన గొయ్యి - మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతున్న వైనం -పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి




కాంట్రాక్టర్ అత్యుత్సాహం.. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం.. ఆ కుటుంబాన్ని మురుగుకూపంలోకి నెట్టింది. మురుగునీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అంతేకాక సొంత ఖర్చుతో గొయ్యిని పూడ్చిన తనపై కార్యదర్శి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని వాపోతున్నాడు. తనవల్ల కుళాయి పైపులు ధ్వంసమయ్యాయని బెదిరింపులకు సైతం పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండల కేంద్రమైన మండవల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొమ్మనబోయిన నాగేశ్వరరావు ముఠాపని చేసుకుంటూ భార్య, అంగవైకల్యం కలిగిన కుమార్తెతో కలిసి మండవల్లి ప్రధాన సెంటర్‌లోని తన నివాసంలో జీవనం సాగిస్తున్నాడు. ఇంటి గోడలు కూడా పడిపోవడంతో ఇల్లు నిర్మించుకునే స్తోమత లేకపోవడంతో చుట్టూ పరదాకట్టుకుని నివసిస్తున్నాడు. ఈ తరుణంలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా డ్రెయినేజీ పనులు నిర్వహిస్తూ నాగేశ్వరరావు ఇంటి వద్ద పెద్ద గొయ్యి తవ్వి పూడ్చకుండా వదిలేశారు. దీంతో మరుగునీరు మొత్తం గుంతలోకి చేరి దుర్వాసన వెదజల్లడంతో అన్నం కూడా తినలేని పరిస్థితి ఏర్పడిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ మురుగులో దోమలు వ్యాప్తిచెంది కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. అంతేకాకుండా దోమల వల్ల కుటుంబీకులు అనారోగ్యం బారిన పడడంతో గత్యంతరం లేక రూ.నాలుగు వేలు అప్పు చేసి జెసిబితో ఆ గుంతను పూడ్చాడు. ఇదిలా ఉంటే అంతకుముందు కాంట్రాక్టర్ నిర్వహిస్తున్న డ్రెయినేజీ పనుల వల్ల పైపులైన్ ధ్వంసమై తాగునీరంతా రోడ్డు పాలవుతున్నా గ్రామానికి తాగునీరు అందడం లేదని, దీనిపై ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కార్యదర్శిపై ధ్వజమెత్తారు. ఈ క్రమంలోనే నాగేశ్వరరావుపై కార్యదర్శి గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ గొయ్యిని ఎవరు పూడ్చమన్నారంటూ నాగేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం కార్యదర్శి కాంట్రాక్టర్‌తో జెసిబి ఏర్పాటు చేయించి గొయ్యి తవ్వించి ధ్వసమైన పైపులకు మరమ్మతులు చేయించి తిరిగి గొయ్యిని పూడ్చకుండా వదిలేశారు. దీంతో మళ్లీ ఆ గొయ్యిలోకి మురుగు నీరు చేరి దుర్వాసన వెదజల్లుతూ దోమలు వ్యాప్తిచెందుతున్నాయని నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. వ్యాధులు ప్రబలకుండా గుంతను పూడిపించాలని కోరినప్పటికీ గుంతను పూడిపిస్తే పైపులైన్లు మళ్లీ పగిలిపోతాయని, ఆ గొయ్యి అలాగే ఉండాలని చెప్పారని బాధితుడు వాపోతున్నాడు. కార్యదర్శి తనపై కక్షపూరిత చర్యలకు పాల్పడడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఉన్నతాధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నాడు. దీనిపై కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టిడిపి ఎస్‌టి సెల్ ఇన్‌ఛార్జిగా మల్లేశ్వరరావు

అభినందించిన నారా లోకేష్

ప్రజాశక్తి - పాలకోడేరు

తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కోనసీమ జిల్లాల టిడిపి ఎస్‌టి సెల్ కమిటీ ఇన్‌ఛార్జిగా గొల్లలకోడేరుకు చెందిన సాల మల్లేశ్వరరావును రాష్ట్ర ఎస్‌టి సెల్‌లో కమిటీ ఇన్‌ఛార్జి కొండారెడ్డి నరహరి వరప్రసాద్ నారా లోకేష్ ఆదేశాల మేరకు ఎంపిక చేశారు. ఈ మేరకు మల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ప్రస్తుతం ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నానని, టిడిపిలో చురుకైన పాత్ర వహించడంతో ఉభయగోదావరి జిల్లాల ఎస్‌టి సెల్ కమిటీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఇప్పటికే జిల్లా ఎస్‌టి సెల్ కమిటీని ఎంపిక చేశారని, త్వరలో మూడు జిల్లాల కమిటీలను ఏర్పాటు చేసి రెండు జిల్లాల్లో టిడిపి బలోపేతం చేస్తానని మల్లేశ్వరరావు తెలిపారు. ఈ క్రమంలో తాను పాదయాత్రలో లోకేష్‌ను కలిశానని ఆయన అభినందించారని తెలిపారు. ఇన్‌ఛార్జి పదవి రావటంలో ఉండి ఎంఎల్ఎ రామరాజుతోపాటు జిల్లా, మండల నాయకులు సహకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకు మల్లేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.



మల్లేశ్వరరావును అభినందిస్తున్న నారా లోకేష్



ఐసు గడ్డలో ఎలుక..

ప్రజాశక్తి - ఆకివీడు(పశ్చిమగోదావరి)

బజార్లో బళ్ల మీద జ్యూస్‌లు తాగేవారు జరభద్రం.. జూస్, ఇతర శీతల పానీయాల్లో వాడే ఐసు గడ్డలో చీమలు, దోమలు సహజంగా కనిపిస్తూనే ఉంటాయి. కానీ ఓ ఎలుక ఐస్ క్యాన్‌లో దూకి చనిపోయింది. ఆకివీడు పట్టణానికి చెందిన జ్యూస్ షాపు యజమాని చూసుకోకుండా ఆ ఐస్ గడ్డను కొనుగోలు చేసి షాపుకు తెచ్చాడు. ఐస్‌ను కడిగిన బండిమీద పెడుతుండగా అందులో చనిపోయిన ఎలుక కనిపించింది. దీంతో అతను ఒక్కసారిగా కంగుతిన్నాడు.

పట్టిసీమ ఫెర్రీ రేవు వేలంపాట వాయిదా

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ ఫెర్రీ రేవు వేలంపాట వాయిదా పడినట్లు పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను ఫెర్రీ రేవు బహిరంగవేలం గతనెల 24వ తేదీన జరిగింది. అయితే పాటదారులు రాకపోవడంతో ఈనెల 11వ తేదీకి వాయిదావేశారు. అయితే అయితే కొన్ని అనివార్య కారణాలవల్ల ఈనెల 12వ తేదీకి మార్చినట్లు తెలిపారు. పాటలో పాల్గొనేవారు సంబంధిత పత్రాలతో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాల కోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు(పశ్చిమగోదావరి)

పేదవాడి సొంతింటి కల కలేనా అని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. సిపిఎం బృందం మండలంలోని పలు గ్రామాల్లో సందర్శించింది. ఈ సందర్భంగా లబ్ధిదారులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రుణాలు ఇంటి కట్టుబడి బేస్‌మెంటు రూఫ్ లెవెల్ వరకూ కట్టుకున్నామన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి తప్ప ఇళ్ల నిర్మాణం పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీలు 50 శాతం ఇళ్లు నిర్మాణం మధ్యలో నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడికీ ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముడే మోజేష్, శ్రీను, శ్రీను, రాపాక వెంకటేశ్వరరావు, అధికారి గంగాజలం పాల్గొన్నారు.

గూడెంలో జగనన్నే మా భవిష్యత్తు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం(పశ్చిమగోదావరి)

జగనన్నే జనం భవిష్యత్తు, నమ్మకం అని ఇంటింటికీ వెళ్లి చాటి చెప్పాలని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ వరకు 15 రోజులపాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తారని చెప్పారు. 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము లేని టిడిపి, జనసేన ఇతర ప్రతిపక్ష పార్టీలు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. గురువారం రాత్రి నుంచే పలు చర్చిల్లో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు జరిగాయి. ముదినేపల్లిలోని ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో భారీ సిలువ మార్గం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 14 స్థలాల్లో క్రైస్తవులు ప్రత్యేక పార్థనలు చేసి కీర్తనలు ఆలపించారు. సిలువ మార్గంలో వందలాది మంది క్రైస్తవ సోదరులు, యువతీయువకులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. అంబేద్కర్‌నగర్‌కు చెందిన సేవా రవి ఆధ్వర్యంలో రెండు వేల మందికి పులిహోర ప్యాకెట్లు అందించారు. ముదినేపల్లిలోని ఎల్‌ఇఎఫ్, పెంతెకొస్తు, చర్చ్ ఆఫ్ క్రైస్ట్, సిబిసిఎన్‌సి, తదితర చర్చిల్లో పాస్టర్లు గుడ్ ఫ్రైడే సందేశాన్ని అందించారు. 40 రోజుల పాటు ఉసవాస దీక్షలు చేపట్టిన క్రైస్తవులు దీక్ష విరమించారు.

మండవల్లి:మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు క్రైస్తవ సోదరులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం మండవల్లిలో సాల్వేషన్ ఆర్మీ పాస్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువును మోస్తూ ప్రదర్శన చేపట్టారు. అనంతరం భైరవపట్నం విచారణకర్త నూతలపాటి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిలువమార్గం కార్యక్రమంలో ఏసుక్రీస్తు శిలువను మోసే విధానాన్ని తెలియజేస్తూ మండవల్లి నుండి భైరవపట్నం వరకూ ప్రదర్శన చేపట్టారు. కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముసునూరు : ప్రజలు శాంతి, సహనం, ఓర్పు కలిగి ఉండాలని క్రీస్తు సూచించారని బ్రదర్ ఆర్‌సిఎం చర్చి పాస్టర్ బెనర్జీ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

చాట్రాయి : గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని చాట్రాయి విచారణ కేంద్రంలో బహిరంగ సిలువ మార్గం ఫాదర్ పోలిశెట్టి జయరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. చర్చి వద్ద నుండి పురవీధుల్లో సిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసుక్రీస్తు వేషధారణతో సిలువను మోశారు.

జీలుగుమిల్లి : మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. జీలుగుమిల్లి గ్రేస్ మందిర్‌లో పాస్టర్ ఎజ్రాశాస్త్రి అధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతం శిలువ మార్గం నిర్వహించారు. దర్భగూడెంలో ఆర్‌సిఎం విచారణలోని లక్ష్మీపురం, దర్భగూడెం గ్రామాల్లో ఫాదర్ జయరాజు, ధర్మరాజు అధ్వర్యంలో 14 ఘట్టాల శిలువ మార్గాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు విశ్వాసులు, సంఘ కాపరులు పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక అర్‌సిఎం చర్చి ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పేట కలిదిండి, కోట కలిదిండి పురవీధుల్లో బహిరంగ శిలువ మార్గం జరిగింది. ఫాదర్ బంటుమిల్లి యోహాను గుడ్ ఫ్రైడే ప్రత్యేకతను వివరించారు. చర్చి ప్రాంగణంలో సుమారు 1500 మందికి అన్నదానం చేశారు.

టి.నరసాపురం : క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బొర్రంపాలెం, తెడ్లం, టి.నరసాపురం, తిరుమలదేవిపేట గ్రామాల్లో రోమన్ క్యాథలిక్ చర్చి విశ్వాసులు శిలువను ఎత్తుకుని శాంతిర్యాలీ నిర్వహించారు. రోడ్ల కూడలిలో ప్రార్థనలు చేశారు. అదేవిధంగా పలు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు కె.నిరీక్షణరావు, సిహెచ్.ఏసయ్య, జి.జ్ఞానరాజు, సిహెచ్.రమేష్, టి.ప్రసన్నకుమార్, డానియల్ రాజ్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ సోదరులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్న సమయంలో మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధాన రహదారులపై సిలువును మోస్తూ క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు.



మండవల్లిలో..



టి.నరసాపురంలో..